క్లుప్తంగా

రహదారిని అభివృద్ధి చేయండి



రోడ్డును నిర్మించాలని కోరుతున్న డ్వాక్రా మహిళలు

కొయ్యలగూడెం : గంగన్నగూడెం గ్రామానికి ఉన్న రహదారిని అభివృద్ధి చేయాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు. ఆదివారం గ్రామంలోని రామాలయం వద్ద డ్వాక్రా మహిళలు సమావేశమై గ్రామ అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళికల గురించి చర్చించారు. యర్రంపేట పంచాయతీ పరిధిలోని ఉన్న గంగన్నగూడెం మండల కేంద్రమైన కొయ్యలగూడెంకి చేరుకోవాలి అంటే ఆరు కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి ఉందని అన్నారు. రహదారి అధ్వానంగా ఉండడంతో సకాలంలో గమ్యస్థానాలకు వెళ్లలేక పోతున్నామని డ్వాక్రా గ్రూపు లీడర్లు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సైతం మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించి రోడ్డు నిర్మించాల్సిందిగా అధికారులను ఆదేశించారని అన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

దేవతామూర్తుల విగ్రహాల అందజేత



ప్రతిష్ఠించిన దేవతామూర్తుల విగ్రహాలు

లింగపాలెం : తుమ్మగూడెం ఎస్సీకాలనీలోని నూతన రామాలయానికి ప్రధాన దేవతామూర్తుల విగ్రహాలను లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత బీవీఎస్ రెడ్డి బహూకరించారు. సుమారు రూ.లక్ష విలువ కల్గిన శ్రీసీతారామ లక్ష్మణ భరత ఆంజనేయస్వామి విగ్రహాలను ఆదివారం ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ తనవంతుగా గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

యాదవ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన వారిని సత్కరిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: అఖిలభారత యాదవ సంఘం జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులుగా మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఎన్నికయ్యారు. ఏలూరులోని అఖిలభారత యాదవ భవనంలో ఆదివారం జిల్లా యువజన విభాగ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బోయిన చంద్రశేఖర్ యాదవ్ (కై కలూరు), ఉపాధ్యక్షులుగా నాగనబోయిన రవీంద్ర యాదవ్ (ద్వారకాతిరుమల), మానికల శ్యాంకుమార్ (ద్వారకాతిరుమల మండలం తక్కెళ్లపాడు), అలాగే ద్వారకాతిరుమల మండల యువజన విభాగ అధ్యక్షుడిగా కంచుం రాంబాబు యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, ద్వారకాతిరుమల మండల యాదవ సంఘం అధ్యక్షుడు మానికల వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు పాకనాటి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడపగడప'కు

కొయ్యలగూడెం : మంగపతిదేవిపేట గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

90 మందికి వైద్యసేవలు

పోలవరం రూరల్ : పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన శ్రీశాంతి ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్య సిబ్బంది సుమారు 90 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సత్తి రవికాంత్ ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్, వినంబిరావు, పల్లవి వైద్యసేవలు అందించారు. ఆరోగ్యశ్రీ ద్వారా అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు.

ఓటర్ల సర్వే పరిశీలన



గూటాలలో ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ బి.సుమతి

పోలవరం రూరల్ : ఇంటింటికీ నిర్వహిస్తున్న ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని ఆదివారం పోలవరం తహసీల్దార్ బి.సుమతి పరిశీలించారు. మండలంలోని గూటాల, పోలవరం గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల సర్వే ఏ విధంగా చేస్తున్నారు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను బీఎల్‌వోల ద్వారా తెలుసుకున్నారు. అలాగే కొన్ని ఇళ్లకు వెళ్లి ఓటర్ల జాబితాలో ఉన్న పేర్ల ప్రకారం ఓటర్లు ఉన్నారా లేరా అన్న విషయాలను పరిశీలించారు.

విజయదుందుభి మోగించిన వైఎస్సార్ సీపీ

చింతలపూడి : నియోజకవర్గంలో జరిగిన సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. మొత్తం మూడు మండలాల్లో ఒక సర్పంచ్, రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవం కాగా రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు పోటీ చేసి విజయం సాధించారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన యడ్లపల్లి రాధిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లింగపాలెం మండలంలో...

లింగపాలెం మండలం కొత్తపల్లి పంచాయతీ 5వ వార్డుకు వైఎస్సార్ సీపీ తరుపున పానుగంటి అవని ఒక్కరే నామినేషన్ వేయటంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మఠంగూడెం గ్రామంలో 8వ వార్డుకు వైఎస్సార్ సీపీ తరుపున పిల్లి శాంతి లీల నామినేషన్ వేయగా, జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా సాయిల జ్యోతి పోటీచేశారు. ఈ పోటీలో వైఎస్సార్ సీపీ మద్దతుదారు పిల్లి శాంతి లీల 61 ఓట్లు మెజార్టీతో విజయం సాధించింది. పాశ్యానగరంలో 10వ వార్డుకు వైఎస్సార్ సీపీ తరుపున పొన్నుబోయిన రమేష్ పోటీ చేయగా టీడీపీ తరుపున సిర్రా వెంకటేశ్వరరావు పోటీచేశారు. అత్యంత ఉత్కంఠగా సాగిన ఈ పోరులో రమేష్‌కు 88 ఓట్లు రాగా, వెంకటేశ్వరరావు 86 ఓట్లు పడ్డాయి. చివరికి 2 ఓట్లు మెజార్టీతో వైఎస్సార్ సీపీ పైచేయి సాధించింది.

కామవరపుకోట మండలంలో...

కామవరపుకోట మండలం, వీరిశెట్టిగూడెం 3వ వార్డుకు వైఎస్సార్ సీపీ బలపరిచిన పాల వెంకటేశ్వరావు, టీడీపీ తరపున కొప్పుసెట్టి నరసింహారావు నామినేషన్లు శారు. అయితే టీడీపీ మద్దతుదారు నరసింహారావు ఓటమి భయంతో చివరి నిమిషంలో నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో వైఎస్సార్ సీపీ బలపరిచిన పాల వెంకటేశ్వరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. మండలంలోని తాడిచెర్ల పంచాయతీ 1 వ వార్డు ఎస్టీలకు రిజర్వు చేశారు. యీ వార్డులో ఎస్టీ అభ్యర్థులు లేని కారణంగా ఎవరూ నామినేషన్‌లు దాఖలు చేయలేదు. దీంతో ఎన్నిక జరగలేదు.



పానుగంటి అవని, కొత్తపల్లి 5వ వార్డు



పిల్లి శాంతిలీల, మఠంగూడెం 8వ వార్డు



పొన్నుబోయిన రమేష్, పాశ్యానగరం 10వ వార్డు



పాల వెంకటేశ్వర్రావు, వీరిశెట్టిగూడెం 3వ వార్డు

రెండు చోట్లా వైఎస్సార్ సీపీదే హవా

ద్వారకాతిరుమల : మండలంలోని రెండు గ్రామాల్లో జరిగిన పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు విజయఢంకా మోగించడంతో పాటు, మంచి మెజారిటీని సాధించారు. ద్వారకాతిరుమల 8వ వార్డులో మొత్తం 309 ఓట్లకు 248 ఓట్లు పోలయ్యాయి. అందులో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి నడికట్టి సీతారామాంజనేయులుకు 156 ఓట్లు రాగా, టీడీపీ బలపరచిన అభ్యర్థి పెద్దింటి నాగేశ్వరరావుకు 83 ఓట్లు, ఇతరులు 5 ఓట్లు సాధించారు. అలాగే నోటాకు 2, చెల్లనివి 2 ఓట్లు పడ్డాయి. దీంతో సీతారామాంజనేయులు 73 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అలాగే గుణ్ణంపల్లిలోని 6వ వార్డులో మొత్తం 295 ఓట్లకు, 240 ఓట్లు పోలయ్యాయి. అందులో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి ముసల నాగ రేణుక 108 ఓట్లు, జనసేన బలపరచిన అభ్యర్థి కేసిరెడ్డి శ్రీదేవి 72 ఓట్లు, టీడీపీ బలపరచిన అభ్యర్థి సర్నాల వెంకటలక్ష్మి 58 ఓట్లు సాధించారు. చెల్లనివి 2 ఓట్లు పడ్డాయి. దీంతో నాగరేణుక 36 ఓట్లు మెజారిటీతో గెలుపొందినట్లు ప్రకటించారు. రెండు చోట్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సీతారామాంజనేయులు, ద్వారకాతిరుమల 8వ వార్డు



ముసల నాగ రేణుక, గుణ్ణంపల్లి 6వ వార్డు

కొరుటూరులో ఏకగ్రీవం

పోలవరం రూరల్ : పోలవరం మండలం కొరుటూరు పంచాయతీలో 1వ వార్డు సభ్యురాలి ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఇక్కడ వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి పాములేటి నాగమణిని వార్డు ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



పాములేటి నాగమణి

జీలుగుమిల్లిలోనూ విజయం మనదే

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి 6వ వార్డుకు జరిగిన ఉపన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి మడకం ధర్మరాజు ఘన విజయం సాధించారు. ఈ వార్డులో 209 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి మడకం ధర్మరాజుకు 118 ఓట్లు వచ్చాయి. అలాగే టీడీపీ బలపర్చిన అభ్యర్థి కూరం బుజ్జియ్యకు 74 ఓట్లు వచ్చాయి. ధర్మారాజు గెలుపు వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది.



ఉప ఎన్నికల్లో వార్డు మెంబర్‌గా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి మడకం ధర్మరాజు

ఇద్దరూ ఏకగ్రీవమే

కొయ్యలగూడెం : పంచాయతీ ఎన్నికలలో కొయ్యలగూడెం మండలం నుంచి ఇరువురి వార్డు సభ్యులు ఏకగ్రీవ విజయం సాధించారు. యర్రంపేట పంచాయతీ 8వ వార్డు అభ్యర్థిగా దండే రాజశేఖర్, వేదాంతపురం పంచాయతీ 3వ వార్డు అభ్యర్థిగా లక్కాకుల వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఏకగ్రీవ ఎంపికలు వైఎస్సార్‌సీపీలో నూతన ఉత్సాహాన్ని నింపాయని పీఏసీఎస్ అధ్యక్షురాలు విగ్గిన వెంకటలక్ష్మి, ఆయా గ్రామాల కన్వీనర్లు వి.రామకృష్ణ, నియోజకవర్గ సర్పంచుల ఫోరం అధ్యక్షులు గేలం త్రివిక్రమ సోమరాజు, దండా బత్తుల సుబ్బారావు, మాజీ సర్పంచ్ దండాబత్తుల రామారావు పేర్కొన్నారు.



దండే రాజశేఖర్, యర్రంపేట 8వ వార్డు, కొయ్యలగూడెం మండలం



లక్కాకుల వెంకటేశ్వరరావు, వేదాంతపురం 3వ వార్డు, కొయ్యలగూడెం మండలం

2024 ఎన్నికల్లో క్లీన్‌స్వీప్‌కు సంకేతం

బుట్టాయగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు నిదర్శనం పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాలు అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన దుద్దుకూరులో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించిందని అన్నారు. ముఖ్యంగా పోలవరం నియోజకవర్గంలో 6 వార్డులకు ఎన్నికల నోటిఫికేషన్ రాగా వాటిలో 3 ఏకగ్రీవంగా వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుందని చెప్పారు. అలాగే జీలుగుమిల్లి మండలం 6వ వార్డులో జరిగిన ఎన్నికల్లో అక్కడి అభ్యర్థి మడకం ధర్మరాజు 44 ఓట్ల మెజారిటీతో గెలుపొందారిన తెలిపారు. ఈ ఎన్నికల్లో మరోసారి టీడీపీకి చావు దెబ్బ తగిలిందని అన్నారు. కొద్ది నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాలు వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం, కరోనా కారణంగా రాష్ట్రంలో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. అయినప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఇచ్చిన వాగ్దానాలను 99 శాతం నెరవేర్చారని అన్నారు. ప్రతి పథకాన్ని అర్హులైన వారికి నేరుగా చేరేటట్లు కృషి చేశారని చెప్పారు. నాలుగేళ్ల పాలనలో సీఎంకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలు వారి కుట్రలను తిప్పి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2024 ఎన్నికల్లో క్లీన్‌స్వీప్‌కు పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాలు సంకేతమని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపిస్తారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వైఎస్సార్ సీపీ అఖండ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

ఉప పోరులో వైఎస్సార్ సీపీ ప్రభంజనం

జంగారెడ్డిగూడెం : రాష్ట్రంలో నిర్వహించిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం చాటిందని, సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు సంపూర్ణ ప్రజాభిమానం లభించిందని ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ పేర్కొన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 66 సర్పంచ్ ఎన్నికల్లో 30 ఏకగ్రీవం కాగా, ఎన్నికలు జరిగిన మరో 23 స్థానాల్లో మొత్తం కలిపి 53 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించిందని ఆమె తెలిపారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసిందన్నారు. అత్యధిక స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు ప్రజలు ఘన విజయం అందించారని పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తే 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాల్లో గెలిచి తీరుతుందని, ప్రతిపక్షానికి తావు లేకుండా విజయదుందుభి మోగిస్తుందన్నారు. ప్రతిపక్షాలు ప్రలోభాలు పెట్టినా, విద్వేషాలు రెచ్చగొట్టినా ప్రజలు వాటన్నింటిని పట్టించుకోకుండా వైఎస్సార్‌సీపీకి అఖండ విజయాన్ని కట్టబెట్టారన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు బుద్ధి తెచ్చుకుని వ్యవహరించాలని, లేకపోతే రాష్ట్రంలో అడ్రస్ లేకుండా పోతారని హెచ్చరించారు.



వందనపు సాయిబాల పద్మ

రమేష్‌కు ఎంపీ అభినందనలు



రమేష్‌ను అభినందిస్తున్న ఎంపీ శ్రీధర్, పార్టీ నేతలు

లింగపాలెం : లింగపాలెం మండలం పాశ్యానగరం పంచాయతీ వార్డు మెంబరుగా గెలుపొందిన పొన్నుబోయిన రమేష్ ఆదివారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ రమేష్‌కు అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేసి విజయం సాధించారని ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ అన్నారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్, రంగాపురం సొసైటీ చైర్‌పర్సన్ రెడ్డిన శ్రీను, మాజీ సొసైటీ చైర్మన్ ఏపూరి సూరిబాబు, సచివాలయ కన్వీనర్ కె.రఘుబాబు, ఎంపీటీసీ సీహెచ్ శివాజీ తదితరులు ఎంపీ శ్రీధర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనలో మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం పంగిడిగూడానికి చెందిన షేక్ కాశీం సాహెబ్ (29) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ ఉదయం కడుపునొప్పి రావడంతో, నొప్పి తట్టుకోలేక కలుపుమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కాశీం సాహెబ్‌ను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి అక్కడ నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 19వ తేదీ సాయంత్రం అతడు మృతి చెందాడు. షేక్ కాశీం సాహెబ్ సోదరుడు షేక్ సలీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

జేబీ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

జంగారెడ్డిగూడెం : స్థానిక ఏలూరు రోడ్‌లో గల జేబీ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెస్టారెంట్‌కు విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన సైన్ బోర్డు మంటల్లో దగ్ధమైంది. ఆ సమయంలో రెస్టారెంట్‌లో సిబ్బంది, కస్టమర్లు ఉన్నారని తెలుసుకున్న ఎస్సై ఎం.సాగర్‌బాబు తమ సిబ్బందితో, అలాగే రెవెన్యూ సిబ్బంది, 108 వాహనంతో సహా ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంతేగాక రెస్టారెంట్ 1వ ఫ్లోర్‌లో ఉండగా, గ్రౌండ్ ఫ్లోర్‌లో బట్టల దుకాణం ఉంది. దీంతో ప్రజలు మరింత భయాందోళనలకు గురయ్యారు. అయితే స్థానికులు, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది కలిసి మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. కేవలం బోర్డు మాత్రమే దగ్ధం కావడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



జంగారెడ్డిగూడెం జేబీ రెస్టారెంట్ సైన్ బోర్డు దగ్ధమవుతున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించాలని వినతి



పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

బుట్టాయగూడెం : తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ బుట్టాయగూడెం మండల వీఏఓలు ఆదివారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు దుద్దుకూరులో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ ప్రతినిధులు వై.లక్ష్మీరాధ మాట్లాడుతూ 15 ఏళ్లుగా సెర్ఫ్ సంస్థలో ఐకేపీలో 70 మంది పనిచేస్తున్నట్లు తెలిపారు. గతంలో తమకు ఎటువంటి గౌరవ వేతనం కూడా లేకుండా పనిచేశామని అన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో రూ.10 వేలు గౌరవ వేతనంగా ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం సెర్ఫ్ నుంచి తమకు రూ.8 వేలు ఇస్తున్నారని, మిగిలిన రూ.2 వేలు వీఓల నుంచి తీసుకోవాలని ఆదేశాలిచ్చారని చెప్పారు. అయితే తాము వీఓల నుంచి ఆ సొమ్మును తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వమే కలుగజేసుకుని తమకు రూ.10 వేలు ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. తాను ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని బాలరాజు చెప్పారు. కార్యక్రమంలో వీఓఏల నాయకులు టీఏ మణి, కె.కనక, డి.దుర్గ, ఎం. ఇందిరా లక్ష్మి, డి.సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మానవతకు రూ.3 లక్షల విరాళం

కామవరపుకోట : మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరిసర ప్రాంతాలలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకుగాను ఆ సంస్థ తడికలపూడి శాఖ డైరెక్టర్ మర్రి సుధాకర్ రావు, అలివేలు మంగకుమారి దంపతులు రూ.3 లక్షలు సంస్థకు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో వేసి వచ్చే వడ్డీతో పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వారి కోరిక మేరకు పంచాయతీ శానిటరీ కార్మికులకు ఆదివారం సర్పంచ్ కొత్తపల్లి రజిని శ్రీనివాస్ చేతుల మీదుగా ఖాకీ దుస్తులు, టవల్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోలా విష్ణు, మానవత డైరెక్టర్లు గంగాధర ప్రసాద్, నల్లూరి కాంతారావు, కోలా శ్రీనివాసరావు, సురేష్ గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

మానవత సేవలు ఎనలేనివి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ఎనలేనివని కామవరపుకోట సర్పంచ్ కరిపోతూ అనూష అన్నారు. మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ అనూష జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. మానవత అధ్యక్షులు వేముల సాయి, కార్యదర్శి రమేష్, గౌరవ డైరెక్టర్ వాసా సుబ్రహ్మణ్యం, కన్వీనర్ సాయన్న కనకరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కొయ్యలగూడెంలో ర్యాలీ

కొయ్యలగూడెం : మానవత శాఖ కొయ్యలగూడెంలో ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తి కావస్తున్న నేపథ్యంలో సోమవారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సభ్యులు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం కన్నాపురం రోడ్‌లోని టెంపుల్స్ సెంటర్ నిర్వహించిన సమావేశంలో సభ్యులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. మానవత చేపట్టిన అభివృద్ధి, సహాయ కార్యక్రమాలపై ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు.

గోడపత్రిక ఆవిష్కరణ

కొయ్యలగూడెం : సీపీఐ బస్సు జాత ప్రచార యాత్ర గోడ పత్రికలను పార్టీ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్ మాట్లాడుతూ బస్సు యాత్రను విజయవంతం చేయాలని, ఈనెల 23న జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలి రావాలని కోరారు. మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే బాజీ, జక్కు చంద్రం, వెలగ రామారావు, మట్ట రామకృష్ణ, ఎస్.రాంబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొమ్ముగూడెంపై కన్ను

- తరలివస్తున్న కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు
- భూముల్లో పెట్టుబడి పెట్టాలని, ఇన్సూరెన్స్ తీసుకోవాలని నిర్వాసితులపై ఒత్తిడి



గొమ్ముగూడెంలోని నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీ

కుక్కునూరు : వారంతా మహానగరాలలోని కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు. వారికి ఒకప్పుడు ఆ గ్రామం పేరు కూడా తెలియదు.. కాని ఇప్పుడు ఆ గ్రామం ఎక్కడుందా అని అడిగి మరీ వెతుక్కుంటూ పెద్ద, పెద్ద కార్లలో వచ్చి గ్రామస్తులతో మాటామంతి కలిపి వారిని పలకరించి వెళ్తున్నారు. ఇంతకి ఆ గ్రామం ప్రత్యేకత ఏమిటీ.. కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు ఎందుకొస్తున్నారా అని పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు ఇటీవల ఆర్అండ్ఆర్ పరిహారం జమైనా గొమ్ముగూడెం గ్రామం. ఆ గ్రామానికి వచ్చే కార్పొరేట్ కంపెనీల వారు మరెవరో కాదు రియల్ ఎస్టేట్ ప్రతినిధులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు. వివరాల్లోకి వెళితే.. కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం గ్రామం పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ ముంపు పరిధిలో ఉంది. గోదావరి వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొమ్ముగూడెం గ్రామం పరిశీలనకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వం ఆ గ్రామానికి ఆర్అండ్ఆర్ పరిహారం జమచేసింది. ఈ విషయం మీడియాలో జోరుగా ప్రచారం కావడంతో రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్ కంపెనీల కన్ను గొమ్ముగూడెంపై పడింది. దీంతో వారి బిజినెస్‌ను పెంచుకునే దిశగా వీరందరూ గొమ్ముగూడెం గ్రామస్తులను కలిసి తమ, తమ కంపెనీల ప్రత్యేకతల గురించి వారు నిర్వహిస్తున్న బిజినెస్‌ల గురించి వివరించే పనిలో పడ్డారు. కొందరు స్థానికంగా ఎవరైనా తెలిసిన వారు ఉంటే వారి సాయం తీసుకొని గ్రామస్తులను కలుస్తుండగా మరికొందరు తమంతట తాముగా నేరుగా గ్రామస్తుల వద్దకు పరిచయం చేసుకుంటున్నారు. అలా పరిహారం జమైన నాటినుంచి తెలంగాణలోని హైద్రాబాద్, ఉమ్మడి ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాలకు చెందిన కార్పొరేట్ ప్రతినిధులు ఎక్కువగా వస్తున్నట్టు తెలుస్తుంది. ఈ విధంగా వస్తున్న వారు వారి మాటలతో అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తున్నారని గ్రామస్తులు వాఖ్యానిస్తున్నారు. ఇది ఇలా ఉండగా గ్రామస్తులు మాత్రం తామంతా వీరి మాటలకు బుట్టలో పడేది లేదని పరిహారాన్ని బ్యాంక్‌లలో ఫిక్సిడ్ డిపాజిట్ చేసుకునేందుకే మొగ్గుచూపుతున్నామని చెబుతున్నారు. కాగా గొమ్ముగూడెం గ్రామానికి పలు రకాల బిజినెస్‌ల ఏజెంట్లు వస్తుండడం చూసిన మండల ప్రజానీకం బెల్లం, ఈగల సామెతను గుర్తుచేసుకుంటున్నారు.

రియల్ ఎస్టేట్ పీఆర్ఓలు వచ్చారు



మా గ్రామానికి ఆర్అండ్ఆర్ పరిహారం జమైన తరువాత చాలా మంది రియల్ ఎస్టేట్ కంపెనీల ప్రతినిధులు వచ్చారు. ఇటీవల హైద్రాబాద్ నుంచి కూడా వచ్చి మమ్మల్ని భూముల మీద పెట్టుబడి పెట్టమన్నారు. వారితో పరిచయం లేని మేము వారిని నమ్మి ఎలా పెట్టుబడి పెట్టగలం. అయినా వచ్చినవారు మంచివారో కాదో తెలియదు. కాబట్టి మా డబ్బుల్ని బ్యాంక్‌లలో ఫిక్సిడ్ డిపాజిట్ చేసుకున్నాం.

– గుమ్మల సత్యనారాయణ, నిర్వాసితుడు, గొమ్ముగూడెం

అయోమయానికి గురిచేస్తున్నారు



మాకు ఆర్అండ్ఆర్ పరిహారం వచ్చిన తరువాత పలు కంపెనీలకు చెందిన రియల్ ఎస్టేట్ ప్రతినిధులు, ఇన్సూరెన్స్ పాలసీల ఏజెంట్లు మా వద్దకు వచ్చారు. అందులో పెట్టుబడి పెడితే ఇంతొస్తుంది, అంతొస్తుందంటూ అయోమయానికి గురిచేస్తున్నారు. వచ్చిన వారిని వెనక్కి పంపడం ఎందుకని వారు చెప్పేది విని మేము చేసేది మేము చేస్తున్నాం.

– నలగల వెంకన్న, నిర్వాసితుడు, గొమ్ముగూడెం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)

Office mail : tpgadvt@gmail.com